# కోత-అడ్డు-పైకోత

ఎ. కమలం



"నచ్చివ్వింకా కూర్చునే వున్నావేంరా! విస్సూ- లే!" అన్నాడు శీను జోళ్ళు తొడుక్కుంటూ.

"ఏం- నీ ముందు కోర్టులో ముద్దాయిలా నుంచోవాలా? నువ్వెంత మేజిస్ట్రేటువైతే మాత్రం-బావా అని పిలవడానికి నోర్రాదా? విస్సూ- అని పేరెట్టి పిలుస్తున్నావ్" అని విసురుగా లేచి చేతిలో పేపరు మడతపెట్టేడు విశ్వనాథం.

"అఘోరించావులే! మనకేం కొత్తా!" పద!" ఇంతలోకి బామ్మగారు అటు వస్తూ "ఇంకా ఇక్కడే వున్నార్రా! ఆసుపత్రి కెళ్ళలేదూ"? అన్నారు.

"ఇంతకీ- మన సెట్టికేమైంది బామ్మా!" అన్నాడు శీను.

"ఒరే! మేజిస్ట్రేటూ-నన్నడగరా నే చెప్తాను!" అన్నాడు విస్సు.

"ఏం-నువ్వు చూసేవా?"

"ఎందుకు చూడలేమా- నువ్వు కట్టిస్తున్న డాబా ఎక్కి-చూస్తే అంతా కనిపిస్తూనే వుంది. ఈ రోజిలాంటిదేదో జరుగుతుందని ముందే అనుకున్నాను."

"అసలేం-జర్గిందో చెప్పరా నాయనా-చంపక!"

"వినండయితే. సెట్టి నిద్రలేచి ఎవరి ముఖం చూసేడోగానీ-చెంబు పట్టుకుని-బయటికిపోదామని-ఇలా. గుమ్మం దిగాడో-లేదో-అలా మన అవధాని వేదూ-యాయవారం బ్రాహ్మడూ....

"అవును-అవధానీ-ఏం చేసేడు?!"

"ఏం-చేసేడా-సెట్టికి ఎదురుగా వచ్చేడు"

"వూఁ వచ్చి సెట్టికి గుండె జబ్బు తెచ్చేడా ?"

"నా మొహంలా వుంది! వచ్చేడన్నాను గానీ- జబ్బు తెచ్చేడన్నానా! వచ్చాడే పో-ఆ-సెట్టి. ఆ-పళాన-లోపల్కి-పోయి-కాళ్ళు కడుక్కుని- కాసేపు కూచుని మంచినీళ్ళు తాగి మళ్ళీ బయటికిపోతే బాగుండునా వుహూఁ ఏదో కొంపలంటుకుపోయినట్టు ముందుకేపోయేడు.

"అయితే అవధానేం చేసేడంటావూ ?"

"అవధానేం చేసేడా. హయ్యా నీ యిల్లు బంగారంగానూ ఇంకా అర్థమవలేదురా ఒంటి బ్రాహ్మడెదురైతే అపశకునం కాదూ ?"

"నీరసంగా తల పట్టుకున్నాడు."అదా-అవునవును లే! తర్వాతేం జర్గింది?"

"వినుమరీ! సెట్టి-మరి నాలుగడుగులు వేసేడో లేదో-నల్లపిల్లి-ఎదురయింది!"

"హమ్మో-నల్లపిల్లే!" అన్నారు బామ్మగారు బుగ్గలు నొక్కుకుంటూ.

"ఆఁ-ఆ-తర్వాత- వరసగా - మంగలి-నూనె తప్పేలాపట్టుకుని. తెలుకు లెంకన్నా-బోడి సుబ్బమ్మా-ఇలా ఒకరి వెనక-ఒకరు పందేలు వేసుకున్నట్టు ఎదురయ్యేరు!"

"సెట్టి గుండె ధైర్యం మెచ్చుకోవాల్సిందే!" అంది బామ్మ.

"బోడి ధైర్యం! చూసేవుగా ఏమైందో. సరిగ్గా సెట్టి మనింటి ముందు నుంచి వెళ్తుండగా-ఖర్మగాలి నాకు అప్పుడే తుమ్మొచ్చింది. కొంప మునిగినట్టు - ఠ పీ మ ని తుమ్మేను!

"ఠపీ - మని తుమ్మేవా - ఠపీ-ఠపీమని రెండుసార్లు తుమ్మేవా?" అంది బామ్మ.

"ఒక్క- తుమ్మే బామ్మా!"

వింటున్న శీనుకి చిరాకెత్తిపోయింది. "ఇంతకీ- ఈ అపశకునాలవల్ల ఆస్పత్రి పాలయ్యే ఉంటారు-అంతేనా- గుండెపోటు కాదంటారు అవునా—" అన్నాడు.

"మరేవనుకున్నావు ?!" నవ్వుతూ కళ్ళెగరేశాడు.

ఇంతలోకి ఈ మాటలు వింటూ వస్తున్న అవధాని- "ఏవండీ- విశ్వనాధం- గారూ మీ- తుమ్మేం- పనిచేసినట్టు లేదే- సెట్టిం పిప్పళ్ళ బస్తాలా రిక్షాలో- తిరిగొస్తున్నాడు-అలా చూడండి !" అన్నాడు.

"అదే- చూస్తున్నానోయ్- అవధానీ-ఒక్క నా తుమ్ముకే ఎగిరి పోతాడనుకున్నాను అలాంటిది- నువ్వూ-పిల్లీ- తెలకలి-మంగలీ. బోడి సుబ్బమ్మా- ఆఁ -!" అని ఒక్కసారి ఆగి నోరు తెరచి వస్తున్న సెట్టిని ఆశ్చర్యంగా చూస్తూ- "ఆఁ! అదిరా అవధాని శకునాన్ని-నల్లపిల్లి శకునం కోత! మంగలాడి శకునాన్ని-తెలకలాడి- శకునం అడ్డు బోడి సుబ్బమ్మ శకునాన్ని- నా తుమ్ము పై కోత!? ఇహనేం - బ్రతకేస్తాడు సెట్టి!! ఇంతలోకి రిక్షాదగ్గరయింది. "ఏఁవోయ్-సెట్టీ-నా తుమ్మే-నిన్ను బ్రతికించింది. లేకపోతే ఈ పాటికి నిన్ను మోసేద్దురు! ఇకనేం భయం లేములే!"

"అబ్బే – భయంలేదన్నారండి డాక్టర్ గారూ! పొద్దుటే – కాఫీ చుక్క యినా తాకుండా తిరక్క- నీరసం-అంతకన్నా ఏం—లేదన్నారండి. పంపించేసేరు!" అన్నాడు సెట్టి.

"అలాగే-అంటార్లేవోయ్! శకునాల సంగతి వాళ్ళకేం తెల్సు! సాయంత్రమలా-మా యింటికి రా! విభూతి పెడ్తాను!" అని లేచి-" వస్తారా-మేజిస్ట్రేటు బామ్మర్దీ-త్వరగా ఇంటికి తగలడు పేకాట్లో కూచోక! సాయంత్రం భక్తులంతా వస్తారు! భజనుంది! తీర్థం-ప్రసాదం-పుచ్చుకుందువు గానీ-అర్థమైందా!" అంటూ అవధానీతో కల్సి ఏ-బాటిల్ బాగుంటుందో-సాయంత్రానికి" అని ఆలోచిస్తూ వెళ్ళిపోయాడు విస్సూ.